క్లుప్తంగా

పారిశుధ్యంపై శ్రద్ధ చూపాలి



డిచ్‌పల్లి: వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై శ్రద్ధ చూపాలని నిజామాబాద్ డీఎల్‌పీవో శ్రీనివాస్ సూచించారు. మండలంలోని నడిపల్లి పంచాయతీని మంగళవారం ఆయన సందర్శించారు. కార్యాలయ రికార్డులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలని, పరిసరాలను శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జీపీ కార్యదర్శి కిషన్‌రావు, జూనియర్‌అసిస్టెంట్ రజత్‌కు సూచించారు.

నాలా కన్వర్షన్ రద్దు చేయాలి



సుభాష్‌నగర్: డొంకేశ్వర్ మండలంలోని దత్తాపూర్ గ్రామ పెద్ద చెరువు కబ్జా చేసి రైస్‌మిల్ నిర్మాణం చేపడుతున్నారని, వెంటనే నాలా కన్వర్షన్ రద్దు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం వారు కలెక్టరేట్‌కు తరలివచ్చి ఏఓ ప్రశాంత్‌కుమార్‌కు, సర్వే ఏడీకి వినతిపత్రాలు అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. చెరువు కబ్జాకు గురైందని గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గతంలో సర్వేయర్ సర్వే నిర్వహించారని, ఆ సర్వేపై అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. సరైన హద్దులు చూపించలేదని, వెంటనే రీసర్వే నిర్వహించి చెరువును కాపాడాలని కోరారు. ఆ భూమిలో రైస్‌మిల్ నిర్మిస్తున్నారని, రెవెన్యూ అధికారులు నాలా కన్వర్షన్ ఎలా చేశారని ప్రశ్నించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపట్టి, తమ గ్రామాన్ని కాలుష్యమయం చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వెంటనే రైస్‌మిల్ నిర్మాణాన్ని ఆపాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ కళాశాలల సమస్యలు పరిష్కరించాలి



నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రయివేట్, కార్పొరేట్ కళాశాలల దోపిడీని అరికట్టాలన్నారు. ఈమేరకు మంగళవారం వారు నగరంలోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నియమించకుండా విద్యార్థుల సంఖ్య ఎలా పెరుగుతుందన్నారు. అదేవిధంగా జిల్లాలోని ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలు నిబంధనలు పాటించకున్నా అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. నాయకులు చందు, నిఖిల్, మహిపాల్, మమత పాల్గొన్నారు.

సమగ్ర విచారణ జరపాలి

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠ్యపుస్తకాల గోదాం నుంచి పుస్తకాలు మాయం కావడంపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీజీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు నగరంలో మంగళవారం విద్యాశాఖ దిష్టిబొమ్మ దహనం చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కళ్యాణ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి వచ్చిన సుమారు 80వేల పుస్తకాలు గోదాం నుంచి మాయం అయినా, బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం దారుణం అన్నారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని, అనుమతులు లేని బడులను వెంటనే సీజ్ చేయాలన్నారు. నాయకులు వినయ్, సుజీత్, సురేష్, రాజు, లడ్డూ, మొయిత్, రాజేష్ పాల్గొన్నారు.

రేపు విద్యాసంస్థల బంద్



నిజామాబాద్‌అర్బన్: విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 4న విద్యాసంస్థల బంద్ పాటించనున్నట్లు ఆయా సంఘాల నాయకులు తెలిపారు. నగరంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీకి నిరసనగా కేజీ టూ పీజీ వరకు విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు వారు తెలిపారు. విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థులు, ప్రజలు బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. అలాగే నీట్ పేపర్ లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, నీట్ పరీక్షను రాష్ట్రాల పరిధిలోకి మార్చాలని కోరారు. పీడీఎస్‌యూ ప్రతినిధులు జన్నారపు రాజేశ్వర్, నరేందర్, గణేష్, ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధులు విఘ్నేష్, మహేష్, నాయకులు రఘురాం, బోడ అనిల్, ప్రిన్స్, గణేష్, అశుర్, నిఖిల్, పాల్గొన్నారు.

కాంగ్రెస్ హిందూ వ్యతిరేక పార్టీ

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- పార్లమెంట్‌లో ప్రతిపక్షనేత రాహుల్ చేసిన వ్యాఖ్యలపై ఖండన



సుభాష్‌నగర్: కాంగ్రెస్ అంటేనే హిందువుల వ్యతిరేక పార్టీ అని, 70 ఏళ్లుగా హిందువులను వివక్షకు గురిచేస్తుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ విమర్శించారు. పార్లమెంట్ సాక్షిగా ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ హిందువులను కించపరుస్తూ మాట్లాడిన మాటలను ఎమ్మెల్యే ఒక ప్రకటనలో ఖండించారు. హిందువులు హింస, అసత్యం, ద్వేషం రెచ్చగొడతారని రాహుల్ పేర్కొనడం సరికాదన్నారు. పదేళ్లు ప్రతిపక్ష హోదారాని కాంగ్రెస్ పార్టీ, ఇటీవల జరిగిన ఎన్నికల్లో వంద సీట్లు కూడా గెలవలేదన్నారు. హిందువుల 500 ఏళ్ల కల అయోధ్య రామమందిరం పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి ఆహ్వానించినా.. కాంగ్రెస్ నాయకులు రాలేదని పేర్కొన్నారు.

తెలంగాణలో కూడా రేవంత్ సర్కారు ఓ వర్గంపై ప్రేమ ఒలకబోస్తున్నారన్నారు. దేశంలో కాంగ్రెస్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తుందని, దేశ విచ్ఛిన్నం కోరుకుంటుందని విమర్శించారు. బీజేపీ కార్యకర్తలు దేశాన్ని, భారతమాతను కాపాడుకుంటారని, హిందువుల వల్ల ఈ దేశం సురక్షితంగా ఉందన్నారు. కాంగ్రెస్ తోక పార్టీ ఎంఐఎం అధినేత ఓవైసీ పార్లమెంట్‌లో జై పాలస్తీనా అన్నందుకు, రాహుల్ చేసిన వ్యాఖ్యలకు యావత్ హిందూ సమాజం ఖండిస్తుందని, వెంటనే హిందూ సమాజానికి వారు క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. భారతదేశంలో బీజేపీ శ్రేణుల గురించి, హిందువుల గురించి మాట్లాడేటప్పుడు వారు జాగ్రత్తగా మాట్లాడాలని హెచ్చరించారు.



నగరంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

రాహుల్ దిష్టిబొమ్మ దహనం

నగరంలోని ఆర్ఆర్ చౌరస్తాలో మంగళవారం ప్రతిపక్ష నేత రాహుల్ దిష్టిబొమ్మను, హిందూ సంఘాల నేతలు, బీజేపీ శ్రేణులు దహనం చేశారు. ఈసందర్భంగా 25వ డివిజన్ శక్తికేంద్ర ఇన్‌చార్జి పల్నాటి కార్తీక్ మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో బీజేపీని, హిందువులను అవమానించే విధంగా హిందువులు అంటే అసత్యం, హింస, వి ద్వేషమని మాట్లాడటాన్ని ఖండిస్తున్నామన్నా రు. హిందువులపైన అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భారత దేశం సురక్షితంగా ఉందంటే కారణం ఈ దేశంలో ఉన్న హిందువులని, బీజేపీ కార్యకర్తలు ఉన్నంత వరకు ఈ దేశాన్ని, భారతమాతను కాపాడుకుంటామన్నారు. మ రోసారి బీజేపీపై కానీ హిందువులపై కానీ తప్పుడు మాటలు మాట్లాడితే సహించేది లేదని హె చ్చరించారు. నాయకులు గింజోట్ కిరణ్, జగదీష్, వంశీ, ప్రశాంత్, బబ్లు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదరించిన ప్రజలకు రుణపడి ఉంటాం

- మోపాల్ ఎంపీపీ లతా కన్నీరాం
- ఘనంగా పరిషత్ సభ్యులకు వీడ్కోలు



మోపాల్‌లో ఎంపీటీసీలను సన్మానిస్తున్న సిబ్బంది

మోపాల్(నిజామాబాద్‌రూరల్) : ప్రజలు తమను ఆదరించి, నమ్మకంతో గెలిపించారని, వారి రుణం ఎప్పటికీ తీర్చుకోలేమని మోపాల్ ఎంపీపీ లతా కన్నీరాం, ఎంపీటీసీలు పేర్కొన్నారు. మోపాల్ మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఎంపీటీసీల వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఐదేళ్ల పదవీకాలంలో ఎంపీటీసీలు చేసిన అభివృద్ధి, వారి సాదక బాధకాలను తెలియజేశారు. అనంతరం ఎంపీటీసీ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఎంపీపీ లతా కన్నీరాం మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది, ఎమ్మెల్యేలు, ఎంపీటీసీ సభ్యుల సహకారంతో ఐదేళ్ల పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేశామని పేర్కొన్నారు. నిధులు మంజూరై అభివృద్ధి చేసినప్పుడే ప్రజాసేవలో నిలదొక్కుకో గలుగుతామని, లేకుంటే హామీలు అమలుచేయకపోతే రాణించలేమన్నారు. ఎంపీటీసీలు గ్రామాల్లో అనేక అవమానాలు ఎదుర్కొన్నారని, గౌరవం లేకుండా పోయిందని పేర్కొన్నారు. కులాస్‌పూర్ ప్రజలు తనపై ఎంతో నమ్మకంతో గెలిపించారని, వారి రుణం ఎప్పటికీ తీర్చుకోలేనని, రూ.50కోట్లతో మండలంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. అంతకుముందు మంచిప్ప ఎంపీటీసీ నిర్మల భర్త మృతిచెందడంతో రెండు నిమిషాలు మౌనం పాటించారు. వైస్ ఎంపీపీ అనితా ప్రతాప్‌సింగ్, ఎంపీడీఓ లింగం, కో–ఆప్షన్ అజీమ్, ఎంపీటీసీలు చద్మల రాములు, బొడ్డు రఘు, జమున గంగాధర్, నిర్మల, ముత్యం, అనుసంగ్యానాయక్, పల్లికొండ రమేష్, నీలం గంగారాం, ఏపీఎం మోహన్, ఏపీఓ సునీత, పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్పల్లి: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ సారిక హనుమంతురెడ్డి, జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, వివిధ గ్రామాల ఎంపీటీసీలను అధికారులు ఘనంగా సన్మానించారు. ప్రజా ప్రతినిధుల పదవీకాలం ముగుస్తున్నందున వారికి సన్మానం చేసినట్లు ఎంపీడీవో బాలకృష్ణ తెలిపారు. తహసీల్దార్ మాలతి తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీటీసీలకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎంపీపీ సంగీత, వైస్ ఎంపీపీ రాజన్న, గడ్కోల్, కొండూర్, తూంపల్లి, కొండాపూర్ ఎంపీటీసీలు గంగారం, పావని, లింగం, భూలీలను సిబ్బంది ఘనంగా సన్మానించారు. 12 మంది ఎంపీటీసీలకు ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. ఎంపీడీవో లక్ష్మీప్రసాద్, ఏఈలు, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



ధర్పల్లి మండల కేంద్రంలో..

రైతాంగ ఉద్యమాలను ఉధృతం చేస్తాం

డిచ్‌పల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రైతులను సంఘటితపర్చి రైతాంగ ఉద్యమాలను ఉధృతం చేస్తామని అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య అన్నారు. డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లిలో మంగళవారం మండలాధ్యక్షుడు దేవస్వామి అధ్యక్షతన ఏఐకేఎంఎస్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా భూమయ్య మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎంఎస్‌పీ (మద్దతు ధరల గ్యారెంటీ) చట్టాన్ని తీసుకువస్తామని ఇచ్చిన హామీ అమలు చేయలేదని విమర్శించారు. స్వామినాథన్ సూచనల ప్రకారం పెట్టుబడిలో 50శాతం కలిపి పంటలకు మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ పార్లమెంట్ సమావేశాలలో అయినా ఎంఎస్‌పీ గ్యారెంటీ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ నెల 4న జిల్లా కేంద్రంలో దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు జేపీ గంగాధర్, సుప్రియ, మీనయ్య, ఎడ్ల రాణి, గోదావరి, పెద్దక్క, శాంత, కంజర లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ నాయకులు

సమస్యలను పరిష్కరిస్తాం



నిజామాబాద్‌నాగారం : నగరంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని మేయర్ దండు నీతూకిరణ్ అన్నారు. నగరంలోని పలు కాలనీల్లో సమస్యలపై ఇటీవల ఫిర్యాదులు రావడంతో మేయర్ స్పందించారు. వర్ని రోడ్డులోని శ్రీరాంనగర్‌కాలనీలో మంగళవారం మేయర్ పర్యటించారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను గుర్తించారు. అధ్వానంగా డ్రెయినేజీ, ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరగడంతో సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డ్రెయినేజీ సమస్యను పరిష్కరించి, పిచ్చి మొక్కలను తొలగించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సీజీహెచ్‌ఎస్ ఏర్పాటుకు కృషి చేయాలి

నిజామాబాద్‌అర్బన్: నగరంలో సీజీహెచ్‌ఎస్(కేంద్ర ప్రభుత్వ హెల్త్ స్కీమ్) వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు కోసం కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్ల సంక్షేమ సమన్వయ కమిటీ సభ్యులు తీర్మానించారు. సుభాష్‌నగర్‌లోని నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో మంగళవారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. కమిటీ జిల్లా అధ్యక్షుడిగా ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శిగా షేక్ హుస్సేన్ ఎంపికయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ.. హైదరాబాద్ సీజీహెచ్‌ఎస్ సెంటర్‌లో మందుల పంపిణీ, చికిత్స విధానం సరిగా పాటించడం లేదని అన్నారు. ఎన్‌పీఎస్ (కొత్త పెన్షన్ స్కీమ్) గురించి, హెచ్‌ఆర్‌ఏ పెంపుదల, ఖాళీ పోస్టుల భర్తీ తదితర వాటిపై చర్చించారు. ఎన్‌వైకే జిల్లా యువజన అధికారిణి శైలిబెల్లాల్, రవి, నవీన్‌కుమార్, సాయారెడ్డి, ఈవిఎల్ నారాయణ, షేక్ మస్తాన్‌వలీ, మోహన్ దాస్, జ్యోతిరాజ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

హెల్త్‌కేర్ మార్కెటింగ్‌లో సర్టిఫికెట్



నిజామాబాద్‌నాగారం: హెల్త్‌కేర్ మార్కెటింగ్‌లో హరీష్ గురిజాల సర్టిఫికెట్ ప్రోగ్రామ్ (సీపీహెచ్‌ఎం-03) పూర్తి చేసి, సర్టిఫికేట్ ఆఫ్ అచీవ్‌మెంట్ పొందారు. ఇటీవల ముంబైలో ఏహెచ్‌ఎంపీ ఇండియా ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు నిర్వాహకులు సర్టిఫికేట్‌ను అందించి, సన్మానించారు. ప్రోగ్రాం డైరెక్టర్ నేహా సత్రోత్ర, వ్యవస్థాపకుడు, ఛైర్మన్ అఖిల్ దవే, సెక్రటరీ చక్రవర్తి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు సికిల్ సెల్ ఎనీమియా రక్తపరీక్షలు

డిచ్‌పల్లి: మండలంలోని సుద్దపల్లిలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మంగళవారం సికిల్ సెల్ ఎనీమియా రక్తపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా క్షయవ్యాధి నియంత్రణ అధికారి, స్థానిక వైద్యాధికారి సంతోష్‌కుమార్ హాజరై మాట్లాడారు. సికిల్ సెల్ ఎనీమియా అనేది జన్యు సంబంధమైన వ్యాధి అని సికిల్ అనగా కొడవలి అని అర్థమని, ఇది కొడవలి ఆకారంలో కుచించుకుపోతుందని తెలిపారు. ఎర్రరక్త కణాలను నాశనం చేస్తుందని, వీటి లక్షణాల ఆధారంగా ఎనీమియా ఏర్పడుతుందన్నారు. సాధారణంగా సికిల్ సెల్ ఎనీమియా ఉన్న విద్యార్థులలో అలసట ఎక్కువగా ఉండటం, పాలిపోయిన చర్మం కలిగి ఉండడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తొందరగా ఇన్ఫెక్షన్లు రావడం, ఆలస్యంగా పెరగడం, పొట్టలో ఎముకలలో నొప్పి, పిత్తాశయంలో రాళ్ల వల్ల గ్యాస్ రావడంతో పాట్ల పెద్దదిగా కనిపించడం తదితర లక్షణాలు ఉంటాయన్నారు. సికిల్ సెల్ ఎనీమియా కలిగిన విద్యార్థులు సరైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్, జిల్లా టీబీ కోఆర్డినేటర్ రవి, స్వామి, నారాయణ, ఆనంద్, ఉదయ, సరిత, గంగుబాయి, సంధ్య, నిర్మల తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తైక్వాండో క్రీడాకారుడికి సన్మానం



నిజామాబాద్‌నాగారం: గోవాలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ తైక్వాండో పోటీల్లో జిల్లాకు చెందిన రాజేష్ (13 సంవత్సరాల విభాగం) వెండి పతాకం సాధించారు. క్యూరుగి విభాగంలో బంగారు పథకం సాధించారు. దీంతో రాజేష్‌ను మాస్టర్ హిరలాల్‌ను మంగళవారం నగరంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సన్మానించారు. మాస్టర్ హీరాలాల్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలను పరిష్కరించాలి

నిజామాబాద్‌నాగారం: తమ సమస్యలను పరిష్కారించాలని కోరుతూ వైద్యశాఖ మంత్రి దామోదరరాజనర్సింహను ఆర్ఎంపీ, పీఎంపీలు ప్రొఫెసర్ కోదండరాంతో కలిసి మంగళవారం హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. ఉమ్మడి రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ నిర్వహించేలా ఆదేశించారని, పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ఇవ్వలేదన్నారు. వెంటనే ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇప్పించి సర్టిఫికెట్లు ఇప్పించాలని కోరారు. ఏళ్ల తరబడి ఇదే వృత్తిలో ఉండి ప్రజలకు సేవ చేస్తున్నామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆర్ఎంపీ, పీఎంపీలపై దాడులు పెరిగాయని కేసులు కూడా పెడుతున్నారని వాటిని ఎత్తివేయాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా ప్రతినిధి పుల్గం మోహన్, రాష్ట్ర నాయకులు శంకర్, బాలబ్రహ్మచారి, హుసేన్ తదితరులు ఉన్నారు.



మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలు

నిరుద్యోగులను ఆదుకోవాలి

నవీపేట: కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను ఆదుకోవాలని కోరుతూ బీజేవైఎం మండల నాయకులు మంగళవారం తహసీల్దార్ నారాయణకు వినతి పత్రం సమర్పించారు. గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలని, గ్రూప్–2,3 నోటిఫికేషన్‌లో అదనంగా పోస్టులను పెంచాలని, 25 వేల పోస్టుల భర్తీ లక్ష్యంగా డీఎస్సీని ప్రకటించాలని, జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు పిల్లి శ్రీకాంత్, రాజశేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తెయూలో ముగ్గుల పోటీలు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో మంగళవారం తెయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ముగ్గుల (రంగోలి) పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు సందేశాత్మకంగా ఆకట్టుకునే రంగురంగుల ముగ్గులు వేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అధ్యాపకులు సీహెచ్.ఆంజనేయులు హాజరై, మాట్లాడారు. మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు పెంపొందించుకోవడంలో విద్యార్థినులు ముందుకు రావడం హర్షణీయమన్నారు. పోటీ ప్రపంచంలో మారుతున్న మార్కెటింగ్‌కు అనుగుణంగా నిర్వహణ సామర్థ్యాలు, నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. న్యాయ నిర్ణేతలుగా అధ్యాపకురాలు ఖైసర్, శ్వేత వ్యవహరించారు. మొదటి బహుమతి అంకిత, రెండో బహుమతి తేజకుమారి, మూడో బహుమతి శ్రావణి, నాలుగో బహుమతి లక్ష్మీ సాధించారు. ఈవెంట్ మేనేజర్లుగా లక్ష్మి, సుహాసిని, పావని వ్యవహరించారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్స్‌డ్	200
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	72,800	వెండి (కిలో)	92,000
22 క్యారెట్స్	67,155	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	40	60	గాజరుగడ్డ	30	50
బెండకాయ	35	50	పచ్చిమిర్చి	60	100
బీరకాయ	50	70	దోసకాయ	20	40
దొండకాయ	15	30	ఆలుగడ్డ	30	50
బీర్నీసుకాయ	100	130	గోబిగడ్డ	25	50
కాకరకాయ	50	75	గోబిపువ్వు	35	50
వంకాయ	15	30	బీట్‌రూట్	30	60
పాలకూర	30	50	కరివేపాకు	40	70
మెంతికూర	50	75	చామగడ్డ	40	60
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	60	80
పుదీనా	50	75	చిక్కుడుకాయ	60	90
క్యాప్సికం	60	80			

– సుభాష్‌నగర్

సమాచారం..

ఆదర్శ పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మిగిలిపోయిన సీట్లలో ఈనెల 4న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజేష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు టీసీ, బోనఫైడ్, ఆధార్ కార్డ్, ఫోటోలతో గురువారం ఉదయం 10 గంటలకు పాఠశాలలో హాజరుకావాలని ఆయన కోరారు. ఆర్మూర్ ఇతర ప్రాంతాల నుంచి డేస్కాలర్‌గా అవకాశం ఉన్న విద్యార్థులు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూప్‌లలో అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	కల్కి-2898 ఏడీ(తెలుగు) - 3.10, 7.90, 10.40
స్క్రీన్-2	కల్కి-2898 ఏడీ (తెలుగు) - 10.30 కల్కి-2898 ఏడీ (3డీ తెలుగు) - 4.00, 7.30, 10.45
స్క్రీన్-3	కల్కి-2898 ఏడీ (3డీ తెలుగు) - 1.35

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	కల్కి-2898 ఏడీ(3డీ తెలుగు)-8.00, 11.45, 3.30, 7.15, 11.00
స్క్రీన్-2	కల్కి-2898 ఏడీ(3డీ తెలుగు) - 10.45, 2.30, 6.15, 10.00
స్క్రీన్-3	కల్కి-2898 ఏడీ (తెలుగు) - 9.15, 4.00, 10.45 మహారాజ(తెలుగు)- 1.00, 7.45
స్క్రీన్ -4	కల్కి-2898 ఏడీ (తెలుగు) - 8.30, 12.15 కల్కి-2898 ఏడీ (హిందీ)- 6.45, 10.30 ముంజ్య (హిందీ)- 4.00
దేవి	కల్కి-2898 ఏడీ (తెలుగు)
నటరాజ్	కల్కి-2898 ఏడీ (తెలుగు)
విజయ్	కల్కి-2898 ఏడీ(తెలుగు)

10న జగన్నాథ రథయాత్ర

డిచ్‌పల్లి: మండల కేంద్రంలో ఈనెల 10న ఇస్కాన్ నిజామాబాద్ ఆధ్వర్యంలో పూరీ జగన్నాథ రథయాత్ర మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు సిద్ధ బలరాందాస్ తెలిపారు. డిచ్‌పల్లిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని కాశీవిశ్వనాథ ఆలయం వద్ద ఉదయం 10 గంటలకు రథయాత్ర ప్రారంభమై డిచ్‌పల్లి ప్రధాన రహదారి మీదుగా కొనసాగుతుందన్నారు. యాత్రలో భక్తులు కోలాటాలు, భజన, కీర్తనలు నిర్వహిస్తారని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి శ్రీమద్భాగవత సప్తాహ ప్రవచనాలు

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని శ్రద్ధానంద్‌గంజ్(కొత్తగంజ్)లోని ఉమామహేశ్వర ఆలయంలో బుధవారం నుంచి బ్రహ్మశ్రీ ఫణతుల మేఘరాజ్ శర్మ శ్రీమద్భాగవత సప్తాహ ప్రవచనాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వరకు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనికోరారు.